


సత్యవాక్కు
THE
WORD OF
TRUTH
క్రైస్తవ మాసపత్రిక
OCTOBER - 2004

అన్ని సంఘములవారు వీక్షించదగిన

TEJA TV




MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్‌లో**

(కాకినాడలో మాత్రమే)

ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 అక్టోబర్ 2004 సంచిక 3


## రక్షించునట్టి విశ్వాసము

(The Faith that Saves)

మానవులు రక్షించబడవలెనంటే విశ్వాసము అత్యవసరము. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. "నేను ఆయనను (అనగా దేవుని కుమారుని) అని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పెను (యోహాను 8:24). గనుక మనము విశ్వాసము కలిగియుండుట చాల అవుసరము.

అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే సరిపోవునా? మనము రక్షించబడవలెనంటే ఎట్టి విశ్వాసము మనము కలిగి యుండవలెను? రక్షించు విశ్వాసము ఎట్టిది? దేవుని వాక్యము దీని విషయమై ఏమి చెప్పుచున్నది? దానిని కొంత ఇప్పుడు చూచుకొందము. యాకోబు 2:14-26 వరకు ఇప్పుడు చదువుకొందము:

"నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము

కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరుడైనను, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక - సమాధానముగా వెళ్ళుడి, చలి కాచుకొనుడి, తృప్తి పొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? ఆలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును..........దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి. వ్యర్థుడా, క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా? మన పితరుడైన అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠము మీద అర్పించినప్పుడు అతడు క్రియల వలన నీతిమంతుడని తీర్పు పొందలేదా? విశ్వాసము అతని క్రియలతో కూడి కార్యసిద్ధి కలుగజేసెననియు, క్రియల మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమైనదనియు గ్రహించుచున్నావు గదా?...కాబట్టి మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రమున కాక (Not by faith only) క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీని వలన గ్రహించితిరి.......... ప్రాణములేని శరీరము ఏలాగు మృతమో ఆలాగే క్రియలు లేని విశ్వాసము మృతము".

యాకోబు వ్రాసిన సంగతిని గమనించుడి. మీకు విశ్వాసము ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మీ విశ్వాసమునకు క్రియలు జోడించుడి. అప్పుడు మాత్రమే మీరు నీతిమంతులని యెంచబడుదురు. మీ విశ్వాసమునకు మీరు విధేయులు కానియెడల అట్టి విశ్వాసము మిమ్మును రక్షించదు. విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా వుండి మృతమైనదగును. అబ్రహాము యొక్క విశ్వాసము ఎట్లు పరిపూర్ణ మాయెను? అతడు దేవుని యందు విశ్వసించుటయే కాకుండ దేవుని మాటలకు సంపూర్ణ విధేయత చూపించుటవలననే కదా? ఈనాడు మనము పరిపూర్ణులము ఎట్లు కాగలుగుదుము? దేవుని వాక్యమును విశ్వసించుటయే కాదు గాని, ఆ వాక్యమునకు విధేయత చూపుట ద్వారానే కదా. యేసు ప్రభువునందు నేను విశ్వసించుచున్నాను గాని, నేను ఆయన నామమున బాప్తిస్మము పొందుటకు నాకు ఇష్టములేదు అని నీవు చెప్పవచ్చును. అట్టి విశ్వాసము నిన్ను రక్షించగలదా? ప్రాణము లేని శరీరము ఏలాగు చచ్చినది అగునో ఆలాగే క్రియల ద్వారా విధేయత చూపని విశ్వాసము కూడాను, చచ్చినదగును.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11వ అధ్యాయమును మనము చూచిన యెడల అనేకమంది విశ్వాస వీరులను గూర్చి పరిశుద్ధాత్ముడు అందు మనకు సాక్ష్య మిచ్చుచున్నాడు. విశ్వాసము బట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. విశ్వాసము బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను. విశ్వాసమును బట్టి నోవహు తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. విశ్వాసమును బట్టి అబ్రాహాము పిలువబడి నప్పుడు ఎక్కడికి వెళ్ళవలెనో అది ఎరుగక బయలు వెళ్ళెను. విశ్వాసమును బట్టి ఇస్సాకు, యాకోబు, యోసేపులు దేవుని చిత్తమును జరిగించిరి. విశ్వాసమును బట్టి మోషే ఐగుప్తు ధనము కంటే క్రీస్తు విషయ మైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి పనిచేసెను. ఇకను ఏమి చెప్పుదుము? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలును గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరిం చుటకు సమయము చాలదు. వారు విశ్వా సము ద్వారా రాజ్యములను జయించిరి, నీతికార్యములను జరిగించిరి. వాగ్దానము లను పొందిరి; సింహముల నోళ్ళను మూసిరి; అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గ ధారను తప్పించుకొని, బలహీనులుగా ఉండి బలపర్చబడిరి. వారు విశ్వాసము ద్వారా చేసిన అనేక ఘనకార్యములను గూర్చి మనము చెప్పుకొన వచ్చును. అయితే వీరం దరు ఘనులెట్లయ్యిరి? వారందరు తమ విశ్వాసమును క్రియల ద్వారా నిరూపించుట వలననేగదా? వారిలో ప్రతి ఒక్కడు కూడ దేవుడు వానికేమి ఆజ్ఞాపించెనో ఆ ఆజ్ఞను అక్షరాల నెరవేర్చిరి. వారందరు దేవుని యెడల తమకున్న విశ్వాస మునుబట్టి విధేయత చూపించిరి. అందు వలన వారు నీతిమంతులని తీర్చబడిరి. వారి విధేయత ద్వారా వారి విశ్వాసము పరిపూర్ణమాయెను. అవిధేయత చూపుచు దేవునికి నమ్మకముగా నున్న ఏఒక్కని గూర్చియైనను బైబిలు బోధించుటలేదు. సరిగదా విశ్వాసులలో అవిధేయతను దేవుడు ఖండించుటయే గాక శిక్షించినట్లు బైబిలునందు అనేక సందర్భములలో మనము చూడగలము. "ఒకడు దహన బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము. బలులు అర్పించుటకంటే ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్ఠము" అని దైవవేదము బోధించుచున్నది (1 సమూ 15:22).

విశ్వాసము మనలను ఎట్లు రక్షించును? మనము దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుటకు ప్రోత్సహించుట ద్వారా అది మనలను రక్షించును. దేవుని వాక్యమును వినుట ద్వారా, చదువుట ద్వారా మనకు ఆ విశ్వాసము కలుగును (రోమా 10:17; యోహాను 20:30-31). ఒకడు రక్షింపబడవలెనంటే అతడు చేయవలసిన కొన్ని పనులున్నవి. పాపులైనవారు యేసునందు విశ్వాస ముంచవలెనని దేవుని వాక్యము ఆజ్ఞాపించుచున్నది. "నేను ఆయనను అని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే మరణింతురు" అని యేసు చెప్పుచున్నారు.

అనేకులు యేసు దేవుడు, దేవుని కుమారుడు అని విశ్వసించి అంతటితో ఆగిపోవుదురు. నేను యేసు ప్రభువుని నా ఆత్మ రక్షకునిగా అంగీకరించుచున్నాను అని అనేకులు మాకు ఉత్తరాలు వ్రాస్తూ యుంటారు. యేసునందు విశ్వాసముంచగానే, లేదా ఆయనను అంగీకరించగానే మేము రక్షింపబడితిమి అని వారి అభిప్రాయము. అయితే అట్టి విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించగలదా? నీవు యేసు ప్రభువు నందు నమ్మికొనుము, వెంటనే నీవు రక్షించబడుదువు అని అనేకులు బోధించుచున్నారు. నీవు నమ్మినంత మాత్రముననే రక్షించబడుదువని వాక్యము చెప్పుచున్నదా? విశ్వసించిన మాత్రముననే నీవు రక్షించబడ గలవా? యాకోబు 2:24 ఏమి చెప్పుచున్నది? "మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము కాక క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడును" అని చెప్పుచున్నది. ఇందులో ఏది సత్యము? మానవుల సిద్ధాంతములా లేక దేవుని వాక్యమా? మన ఆత్మ రక్షణకు దేవుని వాక్యమునే అంగీకరించుట మనకు క్షేమకరము కదా?

అవును, నీవు యేసునందు విశ్వాస ముంచావు, బాగున్నది. విశ్వసించిన నీవు మారుమనస్సు పొందవలెనని యేసు ఆజ్ఞాపించు చున్నారు: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" అని లూకా 13:3లో ఆయన చెప్పుచున్నారు. అటు తరువాత యేసు దేవుని కుమారుడు అని నీవు విశ్వసించుచున్నట్లు, నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని యేసు చెప్పుచున్నారు : "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని మత్తయి 10:32లో ఆయన చెప్పుచున్నారు. అనేకులు నీ పాపములను మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెనని

బోధింతురు. పాపములను మనము దేవుని యెదుట ఒప్పుకొనవలెను. మనుష్యుల యెదుటయితే మన విశ్వాసమును ఒప్పుకొన వలెనని బైబిలు బోధించుచున్నది.

నీవు యేసునందు విశ్వసించావు. పాపముల విషయమై మనస్సు మార్చుకొన్నావు. యేసు దేవుని కుమారుడని ఒప్పుకొంటావు బావుంది. అయితే క్రీస్తు ఇచ్చు రక్షణలోనికి ప్రవేశించుటకు ఒకే ఒక్కటి నీవు చేయవలెను: బాప్తిస్మము పొందవలెను. అబ్బే నేను నీవు చెప్పినవన్నీ చేయుదును గాని బాప్తిస్మము అవుసరం లేదనుకుంటాను అని నీవు అనుకొనవచ్చును. మార్కు 16:16లో యేసు ఏమిచెప్పుచున్నారో ఒక్కసారి వినండి: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును". నీ విశ్వాసమునకు బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపించుము. అపొ.కా. 2:38లో "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నారు. బాప్తిస్మము ద్వారా ప్రభువు నీ పాపములను కడిగివేయును. బాప్తిస్మము పొందిన తరువాతనే నీవు రక్షించబడుదువు గాని దానికి ముందుకాదు. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" అని 1 పేతురు 3:21 చెప్పుచున్నది. మీలో ఎవరయినను నేను విశ్వసించగానే రక్షింపబడితిని అని అనుకొనుచున్న యెడల యేసుప్రభువు గాని, పరిశుద్ధాత్ముడు గాని, అపొస్తలులు గాని అట్లు బోధించలేదని గ్రహించుడి. విధేయత చూపించు విశ్వాసమే రక్షించునట్టి విశ్వాసము. విశ్వాసమొక్కటి మాత్రమే ఎన్నడు ఎవరినీ, ఎక్కడా రక్షించలేదు. అట్లయిన దయ్యములు కూడ రక్షించబడును గదా?

- జాషువా గూటం

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' రేడియో కార్యక్రమములను

ప్రతి ఆది, సోమ, మంగళ, బుధ వారాల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు

రేడియో శ్రీలంక ద్వారా వినండి.

# గొర్రెల దొడ్డి

## (The Sheepfold)

***(యోహాను 10:1-18)***

యోహాను సువార్త 10వ అధ్యాయము మొదటి భాగంలో యేసు ప్రభువు చేసిన బోధ ఇట్లు వ్రాయబడి యున్నది: "గొర్రెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు. ద్వారమున ప్రవేశించువాడు గొర్రెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొర్రెలు అతని స్వరము వినును. అతడు తన సొంత గొర్రెలను పేరు పెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును. మరియు అతడు తన సొంత గొర్రెల నన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొర్రెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును. అన్యుల స్వరము అవి యెరుగవు గనుక అన్యుని ఎంత మాత్రము వెంబడింపక వాని యొద్ద నుండి పారిపోవును" (యోహాను 10:1-5).

యోహాను సువార్త 9వ అధ్యాయములో యేసు ప్రభువు ఒక పుట్టు గ్రుడ్డి వానిని బాగుచేసారు. అతడాయనను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఆయన దేవుని నుండి వచ్చిన వాడని చెప్పుట వలన పరిసయ్యులు అతనిని వెలివేసారు (యోహాను 9:34). ఆ సందర్భములో యేసు మనం చదువుకొన్న ఈ గొప్ప ఉపమానాన్ని బోధించారు. దీనిలో మానవాళిపై యేసుకున్న ఆసక్తి, పరిసయ్యులకున్న ఉపేక్ష మనకు వివరముగా తెలియుచున్నది. నిజ నాయకునికి, నాయకులమని చెప్పుకొని నటించే వారికిగల వ్యత్యాసమును మనము ఇందు చూడగలము.

యేసుప్రభువు ఒక గొర్రెల దొడ్డిని గూర్చి చెప్పారు. పాలస్తీన దేశము గొర్రెలు, గొర్రెల కాపరులు, గొర్రెలదొడ్లతో నిండి యుండేది. గనుక యేసు చెప్పుచున్న సందర్భాన్ని వారు యెరిగినవారే. ఆయన చెప్పిన ఉపమానములో గొర్రెల దొడ్డి సంఘమును, గొర్రెలు శిష్యులను సూచించుచున్నవి. ఆ దొడ్డికి ఒకేఒక్క ద్వారమున్నది. ఆ ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు. యేసు నేనే మార్గమునని చెప్పారు (యోహాను 14:6). మనము క్రీస్తు ద్వారా ఆయన సంఘములో ప్రవేశించిన యెడల మనకు రక్షణ యున్నది.

ద్వారమున ప్రవేశించువాడు గొర్రెల

కాపరి. వేరే విధంగా ప్రవేశింప గోరువాడు అబద్ధ బోధకుడు. గొర్రెల కాపరికి ద్వార పాలకుడు తలుపు తీయును. గొర్రెలు అతని స్వరమును వినును. అతడు అతని సొంత గొర్రెలను పేరు పెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును. క్రీస్తు శిష్యులు ఆయన వాక్యము నెరుగుదురు. ఆయన తన వారి నెరుగును (2 తిమో 2:10). అన్యుల స్వరము లేక, అబద్ధ బోధకుల స్వరమును వారెరుగరు గనుక వారెంత మాత్రము వారిని వెంబడింపరు. మరియు ఆయన తన సొంత శిష్యులను నడిపించు నపుడెల్ల వాటికి ముందుగా నడుచును. ఆయన మన శోధనలను, బాధలను ముందుగానే సహించారు, గనుక మనకు తప్పక సహాయము చేయును (హెబ్రీ 4:15).

"కాబట్టి మరల యేసు వారితో ఇట్లనెను : గొర్రెలు పోవు ద్వారమును నేను............... నేనే ద్వారమును; నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచుండును" (యోహా 10:7-9).

సంఘము వెలుపల యున్నవారికి, లోపలయున్న వారికి ద్వారము యేసు ప్రభువే. బయట లోకములో బహు ప్రమాదములున్నవి, గాని లోపలయున్న వారిని ఆయన సంరక్షించును. "ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించారు" (ఎఫెసీ 1:3). "గొర్రెలు పోవు ద్వారము నేనే; నాకు ముందు వచ్చిన వారందరు దొంగలును, దోచుకొనువారునై యున్నారు; గొర్రెలు వారి స్వరము విన లేదు" అని ఆయన చెప్పారు. దొంగ మోసం చేసి, హత్య చేసి అదిరించి బెదిరిస్తాడు. క్రీస్తుకు ముందు, ఆ తరువాత వచ్చినవారు, మూల్యము చెల్లించకుండ క్రైస్తవ్యము యొక్క లాభములను పొందాలని కాంక్షించారు. గాని ప్రజలు వారి స్వరమును వినలేదు.

నేనే ద్వారామును అని 9వ వచనములో యేసు ప్రభువు మరల చెప్పారు. నా ద్వారా లోపల ప్రవేశించినవాడు రక్షింపబడు నని ఆయన చెప్పారు. దేవుడు సంఘము లోపల రక్షణ నుంచాడు. రక్షించిన వారందరిని సంఘములో చేర్చారు, చేర్చుచున్నాడు (అపొ.కా.2:47). క్రీస్తే సంఘమునకు రక్షకుడు (ఎఫెసీ 5:23).

క్రీస్తు సంఘములో యున్నవాడు క్రీస్తునందున్న అమితమైన ఆశీర్వాదములను పొందుటకు అర్హుడు. అతడు పనిచేయుటకు, దేవుని నారాధించుటకు స్వాతంత్ర్యము కలిగి యున్నాడు. సంఘ

ముతో కలిసి చేయు కృషి ద్వారా అతనికి సమృద్ధియైన జీవము కలుగును.

గొర్రెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని యేసు నిశ్చయంగా వారితో చెప్పారు; గాని పరిసయ్యులు క్రీస్తు ద్వారా లోపలికి ప్రవేశించ నిరాకరించారు. ఆయన నాశనం చేయడానికి గాక, జీవము కలుగజేయుటకు వచ్చారు, నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను మరల బ్రతుకునని ఆయన చెప్పారు. ఆయన ఈ లోకంలో జీవమును, రాబోవు లోకంలో నిత్యజీవమును ఇచ్చుటకు వచ్చారు.

తరువాత యేసు "నేను గొర్రెలకు మంచి కాపరిని, మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును...........తండ్రి నన్ను ఏలాగున ఎరుగునో నేను తండ్రిని ఏలాగు ఎరుగుదునో ఆలాగే నేను నా గొర్రెలను ఎరుగుదును, నా గొర్రెలు నన్ను ఎరుగును. మరియు గొర్రెల కొరకు నా ప్రాణము పెట్టుచున్నానని" చెప్పారు (యోహాను 10:11-15).

యేసు మంచి గొర్రెల కాపరి. ఆయన మంచి కాపరియని తన శిష్యులెట్లు ఎరుగుదురు? మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము నెట్లు పెడతాడో, క్రీస్తు తన వారి కొరకు తన ప్రాణాన్ని పెట్టాడు. జీతగాడు గొర్రెల కాపరి కాడు, గొర్రెలు తనవి కాదు. అందువలన తోడేలు వచ్చుట చూచి వాడు పారిపోవును. డబ్బుకొరకు, స్వార్థం కొరకు పనిచేయు వాడంతే. ఏమైనా ప్రమాదం సంభవించేలాగుంటే శిష్యులందరినీ విడిచి పారిపోతాడు. కేవలం జీతగాళ్లయిన బోధకులను ఎంతమందిని మనం చూడడంలేదు? వారిలో ఎంతమంది పారిపోయి మరొకని దగ్గర కుదరలేదు?

మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణమును పెట్టును. క్రీస్తు మనకొరకు తన ప్రాణాన్ని పెట్టారు. అపవాది, మరణం అనే తోడేలు ఎదురొస్తే ఆయన దాన్ని ఎదుర్కొన్నారు. మరణ బలము గలవాని యింటజొచ్చి, వాని బంధించి, విజేయుడై తిరిగి లేచారు. "నేను మరల దాని తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నానని" ఆయన చెప్పారు.

అవును యేసుప్రభువు నిన్ను, నన్ను ఆయన రక్తములో కడిగి శుద్ధుని చేసి, తన సంఘముతో చేర్చుకొనునట్లా పనిని చేసాడు. ఈనాడు కూడ నీవుఆయన దొడ్డిలో ప్రవేశించగలవు. ఆయన స్వరం వినుము, ఆయనయందు విశ్వాస ముంచుము. పాపముల విషయమై మారుమనస్సు పొందు, పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తు నామమున బాప్తిస్మం

పొందుము. ఆయన ద్వారా ఆయన సంఘముతో చేర్చబడి సమృద్ధియైన జీవితాన్ని ఈనాటి నుండే అనుభవించు (యోహాను 8:24; లూకా 13:5; అపొ.కా. 2:38).

✍ - జాషువా గూటం

# దేవుడున్నాడా?

**సాతాను సవాల్ :** నేను పరుండినప్పుడు నాపై ఆయన తీసుకున్న జాగ్రత్తకు, ప్రేమతో నన్ను సంరక్షించినందుకు, నా జీవితంలో ప్రతి అక్కరతీరుస్తూ నాపై చూపుతున్న ఆదరణను నేను ఉదయం నిద్రమేల్కొన్న వెంటనే దేవునికి హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లించాను. "ఒక వేళ దేవుడున్నట్లయితే ఆయనను నీవు చూడలేదా? అనే పిచ్చి ఆలోచన నీ పుర్రెలో పుడితే............. అప్పుడేమిటి? అని సాతాను నా మనస్సులో ఒక ఆలోచన కలిగించింది. స్వచ్ఛముగా, మనస్ఫూర్తిగా నేను ఆ సంఘటన గూర్చి అలా జరిగితే అప్పుడే మిటి అని ఆలోచించాను. నామదిలో దానికి సమాధానం లేదు. దేవుని యెడల నాకు గల గాఢమైన ప్రేమ దీనితో హరించుకుపోయింది. నా జీవిత నావకు లంగరు లేకుండా పోయింది. నేను ఎటువైపు పయనిస్తున్నానో తెలుసుకో లేకపోతున్నాను నా హృదయంలో నాకంటే ప్రముఖస్థానం మరెవ్వరికీ లేదు. నేటి భౌతిక అవసరతను మించిన ఆవస్యకత నాకేమీ కనిపించలేదు. ఎందుకనగా రేపు అనేది రాకపోవచ్చు. నిత్యత్వము అనేది భౌతికముగా లేకపోవచ్చు. శూన్యము, భయము, ప్రళయ భావన నా మనస్సులోని అణువణువున నిండిపోయింది. దేవుడు లేకపోతే అది చాలా చెడ్డ విషయం.

"ఏమి మిగలదు", నేను ఇప్పటికీ ఉన్నాను. ఈ లోకంలోని సవాళ్ళన్నీ ఇప్పటికీ ఉన్నాయి. వీటిలో ఒక యదార్థం తెలుసుకున్నాను. అదేంటంటే నాకు సహాయపడే వారు ఏవిధంగానైనా లేరని మనల్ని చూసి మనం భయపడటం కంటే గొప్పదేమీ లేదని తెలుసుకున్నాను. ఉన్నతులు, విశ్వాసము కోల్పోయిన వారు ఈ సృష్టిలో ఆత్మహత్యలు పరిష్కారం కాదని అద్భుతంగా తెలుసుకున్నాను. నీవు నీ

చుట్టుఉన్న అద్భుత ప్రపంచంలోనే ఉన్నావు. భార్యను పోగొట్టుకోవడం, నీవు చూస్తున్న పిల్లల్ని కోల్పోవడం, లేక నాశనమైపోవడం చూడ్డాన్ని బట్టి ఒంటరితనం అనే ఆలోచన హటాత్తుగా తొలగిపోయింది. నాశనకరమైన విషయమేంటంటే నీవు ఎప్పుడూ చూడని నీ దేవుని కోల్పోవడం. ఈ యధార్థ విషయాలు నీ హృదయంలో ఉన్నట్లయితే సాతాను కుతంత్రాలు నీకు కలిగిస్తున్న అనుమానాలు పటాపంచలై పోతాయి. మానవుని అభివృద్ధి అంతటిలో మానవత్వానికి బయటి ఎదుగుదల కాదు గాని దేవుని యందు నమ్మక ముంచుట ముఖ్యము. కానీ ప్రతి మానవుని ఆత్మ దేవుని సన్నిధి కోసం ఘోషిస్తోంది (కీర్తన 27:1-10).

నేటికీ కూడా లోకంలోని ప్రజలు రెండు తరగతులుగా ఉన్నారు. అల్ప సంఖ్యాకులు వారు దేవుని తృణీకరించువారు. సంఖ్యాపరంగా వారు ఎక్కువ సమస్య లను ఎదుర్కొంటున్నారు. (ప్రవర్తన ద్వారా ఉద్రేక పడటం ద్వారా). వీరిలో విశ్వాసుల కంటే ఆత్మహత్యలు చేసుకునే వారు ఎక్కువ. అధిక సంఖ్యాకులైన విశ్వాసులు దీనికి వ్యతిరేకంగా ఉన్నారు. వారు మనస్సాక్షి ప్రకారం జీవిస్తూ దేవుని ఉనికిని అంగీకరిస్తారు. వారు ఆయనను అర్థం చేసుకొంటూ ఆ మార్గంలో కోట్లకొలది మైళ్ళ ప్రయాణం చేస్తారు. అయితే వారి హృదయంలో దేవుడున్నారు అనే స్థిరమైన అభిప్రాయం కలిగివుంటారు.

ఇరువర్గాల మనస్సులు దేవునికి సంబంధించిన ఆలోచనలే. ప్రపంచములో వేరొక ఆలోచనకు తావేలేదు. దేవుడు లేపోతే మనం ఎవరి పోలికలో నిర్మించబడ్డాము? తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలవలె మన ఆత్మలు ఎవరిని సంబోధిస్తున్నాయి? ఇది తరతరాల నుండి వస్తున్న సార్వత్రిక సత్యము. ఇది యదార్థము. నమ్మదగినది. సాతాను ఉన్నదనే దానికి అనుమానం ఏమీ లేకపోయినను నేను దాన్నెప్పుడూ చూడలేదు.

ఎందుకనగా - మొదటి కారణం నేను అన్ని సందర్భాల్లోను పాపము, చెడుతనము, వినాశనం సాతాను క్రియలే అని తెలుసుకొంటున్నాను. రెండో కారణం సాతాను తంత్రాలను తెలుసుకోవడానికి మన మేదస్సుకు పరీక్ష పెట్టడంలేదు గాని "మీ విరోధియైన సాతాను గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదుకుచు తిరుగుచున్నాడు". (1 పేతురు) అని చెబుతున్నారు. దేవుడే మనలను హెచ్చించి యున్నారు. సాతానుకు

చిక్కకుండా విశ్వాసములో స్థిరపడుటకు దేవుడే మనలను కాపాడును. ఎందుకనగా దేవుడు యధార్ధ వంతుడు. దేవుడు మనలను ముందుగనే హెచ్చరించినందున మన వాదన ఎప్పుడూ ఉన్నతంగానే ఉంటుంది.

ఈ కారణాల వల్ల లోకంలో సాతాను ఉన్నదనే దానిని ప్రశ్నించవలసిన అవసరం లేదు. అది దేవునితో పోలిక ఏవిధంగానూ సరిపోదు. మరియు దేవుడున్నాడనే దానికి సాతానే నిదర్శనం. దేవునికి విరోధియైన సాతాను మనకు ఎప్పుడూ దేవుని ఉనికిని గూర్చి అనుమానం కలిగించటానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు.

"వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడనై యున్నాడు (యోహాను 8:44).

మా ప్రియ పరలోకపు తండ్రీ నీ యందు విశ్వాసములో జీవించుటకు, నేను నడచునప్పుడు, పండుకొనునప్పుడు, నిద్రించినప్పుడు నీ సజీవమైన రెక్కల క్రింద సంరక్షించు చున్నందుకు నీకు వందనములు.

- బెట్టీ బర్టన్ ఛోట్.

# క్రీస్తునందున్న దీవెనలు

## (Blessings in Christ)

మానవులనందరిని ఏదో ఒక రీతిగ దేవుడు దీవించుచునే యున్నాడు. గాలి, నీరు, ఆహారము, వస్త్రములు మొదలగు వందలకొలది అవుసరములను ఆయన మానవుల కనుగ్రహించు చున్నాడు: భక్తుడైన యాకోబు బైబిలునందు ఇట్లనుచున్నాడు: "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును; ఆయనయందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏఛాయయైనను లేదు" (యాకోబు 1:17). "దేవుడు చెడ్డవారిమీదను, మంచి వారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతి మంతులమీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు" అని క్రీస్తు పునరుద్ఘాటించెను (మత్తయి 5:45).

మరికొన్ని దీవెనలు దేవునికి లోబడు వారికి మాత్రమే ప్రత్యేకముగా యుంచబడినవి. ఇవి ఆత్మీయ దీవెనలు, అవి

క్రీస్తునందు మాత్రమే దొరుకును. "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" అని అపొ.పౌలు వ్రాసెను (ఎఫెసీ 1:3).

ఈ ఆశీర్వాదములు క్రీస్తులోనే, కేవలము క్రీస్తులోనే దొరుకుచున్న యెడల, ఒకడు క్రీస్తునందు ప్రవేశించుట యెట్లు? అనే ప్రశ్న ఉద్భవించును. లేఖనములలో రెండువచనములు దీనికి జవాబిచ్చుచున్నవి. మొదటిది రోమా 6:3: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగదా?". రెండవది గలతీ 3:26, 27: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు".

దీనినిబట్టి ఒకడు దేవునికి విధేయుడై నప్పుడు సమస్త ఆత్మీయాశీర్వాదములు కలిగియున్న క్రీస్తులో ప్రవేశించునని మనము గ్రహించుకొనగలము. క్రీస్తులోనికి ప్రవేశించకుండ ఒకడు దేవునికి విధేయుడు కాజాలడు. బాప్తిస్మము లేకుండ ఎవడు క్రీస్తులో ప్రవేశింపజాలడు. ఈ యాశీర్వాదములను పొందు మార్గము ఇది ఒకే ఒక్కటి మాత్రమే. 'క్రీస్తునందు' అనుపదము ఒకడు ప్రవేశించు పరిస్థితిని సూచించుచున్నది. ఇది రక్షించబడిన స్థితి, క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమగు సంఘములో యున్న స్థితి (2 కొరింధి 5:17; కొలస్స 1:18, ఎఫెసీ 1:22, 23).

దేవుడు తన ప్రజలకు దాచియుంచిన దీవెనలన్నియు ఇక్కడ దొరకును. అవి క్రీస్తులోనేగాని ఆయనకు వెలుపల లేవు. దేవునికింకను లోబడనివారు వాటిని పొందజాలరు. వారు పొందగలిగిన యెడల ఆయనకు విధేయత చూపించవలసిన కారణమే లేదు. అయితే సాధరణముగా మనుష్యులు ఈలోకములో పొందు దీవెనల కన్న దేవుడు తన ప్రజలను ఎక్కువ దీవించె దనని వాగ్దానము చేసెను. అయితే క్రీస్తు నందున్న కొన్ని ఈ ఆత్మీయాశీర్వాదము లేవి?

1. క్రీస్తునందు క్షమాపణ : "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

2. క్రీస్తునందు పరిశుద్ధాత్మ యను వరము: "మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొంది దురు" (అపొ.కా. 2:38).

3. క్రీస్తునందు సజీవులుగా చేయ బడుట: "ఆదాము నందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తు నందు అందరు బ్రదికింపబడుదురు" (1 కొరింధి 15:22).

4. క్రీస్తునందు నూతన సృష్టియగుట: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17).

5. క్రీస్తునందు అందరు సమానులే: "ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసు క్రీస్తు నందు మీరందరు ఏకముగా ఉన్నారు" (గలతీ 3:26).

6. ప్రార్థించు తరుణము క్రీస్తునందు న్నది: "దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దైవ భక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును" (యోహాను 9:31).

7. క్రీస్తునందున్న వారితో ఆయన సదాకాలము ఉందునని వాగ్దానము చేసెను: "ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20).

8. క్రీస్తునందు నిరీక్షణ యున్నది: "మీ ప్రయాసమును మన ప్రభువైన యేసు క్రీస్తునందలి నిరీక్షణతో కూడిన మీ ఓర్పును, మేము మన తండ్రియగు దేవుడని యెదుట మానక జ్ఞాపకము చేసికొనుచున్నాము" (1 థెస్స 1:3).

ప్రభువుతో కలిగిన నూతన సంబంధములో మనకు లభించు ఆశీర్వాదములలో ఇవి కొన్ని మాత్రమే. నీవు క్రైస్తవుడవు కాని యెడల నీవేమి పోగొట్టు కొనుచున్నావో నీకు తెలియదు. క్రైస్తవునికి భౌతిక ఆశీర్వాదములే గాకుండ ఆత్మీయాశీర్వాదములన్నియు లభించును. క్రీస్తునందు అతడున్నాడు. వాటితో అతడు భాగ్యవంతుడు. నీవు దేవునికి లోబడి అట్టి యాశీర్వాదములన్నియు దొరకు క్రీస్తులో ప్రవేశించిన యెడల వాటిని నీవుకూడ పొందగలవు (మార్కు 16:16; అపొ.కా. 2:47, ఎఫెసీ 1:22, 23; ఎఫెసీ 1:3).

✍ - జాషువా గూటం

# పాపము చేయు ధ్వంసము

## (Sin's Devastation)

నేటి లోకంలో గొప్ప ధ్వంసము చేయున దేమిటి? గల్ఫ్ దేశాలలో యుద్ధం వస్తే గొప్ప విధ్వంసము జరుగుతాదని కొంద రంటారు. మరికొందరు యూరప్‌లో జరుగు చున్న జాతిపరమైన ఘర్షణ వలన ధ్వంసము జరుగుతాదనుకొంటారు. ఇంకా కొందరు ప్రపంచ ఆర్థిక పరిస్థితిని జాగ్రత్తగా గమ నించుచున్నారు. చాలమంది నేరములను, జాతి వివక్షతలను, పేదతనమును, నిరుద్యో గమును చివరకు ఇరాక్‌లోని పరిస్థితిని చూపిస్తారు.

అయితే నేటి అతిపెద్ద సమస్య, నేడు మనం ఎదుర్కొను గొప్ప వినాశకరమైన సమస్య పాపము అని నేను చెబుతాను ! పాపము విచ్చలవిడిగా తిరుగు తుఫాను వంటిది. అదొక భయంకర అగ్నిపర్వతము. ఎవని మ్రింగుదునా యను గర్జించు సింహము వంటిది ! నిజంగా పాపము ఈ లోకానికి పట్టిన కొరుకు పుండు వంటిది. అది దానిముందున్న దాని నంతటినీ కొట్టు కొనిపోవు గొప్ప కెరటం వంటిది. పాపమును మరింత సూక్ష్మంగా పరిశీలించి, అది ఎందుకు ఈ లోకంలో గొప్ప విధ్వంసము కలుగజేయునట్టిదో తెలిసికొందము.

మొదటగా మనం పాపమును నిర్వ హించాలి. 'గురి తప్పిపోవుట' అని పాపము అనుమాటకు అక్షరార్థము. "ఆజ్ఞాతి క్రమమే పాపమని" 1 యోహాను 3:4 చెప్పుచున్నది. "సకల దుర్నీతియు పాప మని" 1 యోహాను 5:17 చెప్పుచున్నది. "మేలైనది చేయనెరి గియు, ఆలాగు చేయని వానికి పాపము కలుగునని" యాకోబు 4:17 చెప్పుచున్నది. "విశ్వాసమూలము కానిదేదో అది పాప మని" పౌలు రోమా 14:23లో వ్రాసెను. గనుక దేవుడు నిషేధించిన దానిని చేయు నప్పుడు మనం పాపము చేయుదుము. మనం చేయవలసినది చేయనప్పుడు పాపము చేయుదుము. సరియైనది చేయక పోవడం, విచ్చలవిడిగా ప్రవర్తించడం పాపము. మనస్సాక్షిని అతిక్రమించడం పాపము. అయితే బైబిలు ప్రకారము నడిపింపబడే మనస్సాక్షియే క్షేమకరమైన మార్గదర్శియగును.

రెండవదిగా, మన భౌతిక కాయంపై పాపము చేయు ధ్వంసాన్ని గమనించుదాం. ఆదాము హవ్వల పాపము వలన స్త్రీలు గొప్ప వేదనతో పిల్లలను కనుచున్నారు. వారి పాపము వలన పురుషులు కష్టపడి

చెమటోడ్చి పనిచేయకపోతే కడుపు నిండదు (ఆది. కా. 3:16-19).

త్రాగుడు మన శరీరంలో గొప్ప విధ్వంసాన్ని కలుగజేస్తాది. "మద్యముతో మత్తులై యుండకుడి" యని మనకు చెప్ప బడింది (ఎఫెసీ 5:18). మత్తులై యుండుట (మత్తత) శరీర కార్యమునకు సంబంధించి నది. దేవుని రాజ్యములో ప్రవేశించకుండా అది మనలను ఆటంక పరుస్తాది (గలతీ 5:19-21). 1 కొరింథీ 6:9-10ని కూడ చూడుము. త్రాగుడుకు లోనైన వారిలో 50 శాతం త్రాగే తల్లిదండ్రుల పిల్లలు. త్రాగుడు నేటిలోకంలో ప్రప్రధమ సమస్యయై యున్నది. అమెరికాలోనే ఒక కోటిమంది త్రాగేవారున్నారు. ఇంకో కోటి మంది దానికి అలవాటుపడుచున్నారు. రోడ్ల మీద జరిగే ప్రమాదములనేకములకు త్రాగుడే కారణం. అది కాలేయమును నాశనం చేయును.. ఆత్మహత్యకు దారితీయును. దానివలన అనేక కుటుంబాలు నాశనమయ్యాయి. లక్షలాది గృహాలు ఛిన్నా భిన్నమయ్యాయి.

జారత్వము వలన శరీరము నాశనం అవుతాది. లైంగిక సంబంధవ్యాధులు, ఎయిడ్స్ అనువ్యాధి ఈ లోకంలో ఘోరంగా ప్రబలియున్నాయి. ఈ రోగములు ఒకని శరీరాన్ని, గృహాన్నీ కూడా నాశనం చేస్తాయి. పాపము వలన అనేకమంది గర్భ విచ్ఛిత్తికి పాల్పడుచున్నారు. వ్యభిచారము, ఏకలైంగిక సంపర్కము (Homosexuality) నానాటికీ ప్రబలుచున్నవి. అయితే దేహము జార త్వము నిమిత్తము కాదని బైబిలు చెప్పు చున్నది (1కొరింథీ 6:13). క్రైస్తవులు జారత్వ మునకు దూరముగా పారిపోవాలని హెచ్చ రింపబడి యున్నారు (1 కొరింథీ 6:18). జారత్వము, అపవిత్రత, కాముకత్వము, వ్యభిచారము మొదలగునవి శరీర కార్య ములు. వాటిని అభ్యసించువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు (గలతీ 5:19-21). జారత్వము ఒకని ఆత్మను నాశనం చేసేస్తాది (సామె 6:32; ప్రక 21:27). హృదయశుద్ధి గలవారే దేవుని చూస్తారు (మత్త 5:8). పరిశుద్ధత లేకుండా ఎవడును దేవుని చూడనేరడు (హెబ్రీ 12:14).

తిండిబోతుతనము శరీరమునకు నాశనం కలుగజేస్తాది. కొందరు మితిలేని తిండి తిని తమ బరువును శరీరాన్ని అమి తంగా పెంచుకొన్న వారున్నారు. తమ చేతు లలో తామే గొయ్యి తీసికొనుచున్నారు. తమ ఆత్మల వినాశనానికి తామే కారకులు, క్రైస్తవులు ఆశానిగ్రహము గలవారై యుం డాలి (గలతీ 5:22, 2 పేతురు 1:6; ఫిలి 4:5).

మాదకద్రవ్యాలు శరీరమునకు నాశనం కలుగజేస్తాయి. మాదకద్రవ్యాల కలవాటు పడినవారి వలన అనేక నేరములు జరుగుచున్నాయి. మన శరీరములను దేవుని కొరకు వినియోగించాలి (1 కొరింథీ 6:13). మన శరీరములను సజీవయాగముగా దేవునికి సమర్పించుకోవాలి (రోమా 12:1). క్రైస్తవులు దేనికీ బానిసలు కాకూడదు. అయినను కొందరు మత్తుమందులకు మాదకద్రవ్యాలకు బానిసలవుచున్నారు. ఎంత విచారము ! క్రీస్తుతో మన జీవితాలను నింపుకోవాలి. ఆయన మాత్రమే మనకు యధార్థమైన శాశ్వత శాంతినీయగలడు (యోహాను 14:27).

ఆత్మహత్యల వలన కలుగు వినాశము ఇంతా అంతాకాదు. అమెరికాలోనే సంవత్సరానికి. యాభైవేలమంది ఆత్మ హత్యకు పాల్పడుచున్నారు. అమెరికాలో అది గొప్ప మరణకారణమై యున్నది. కాలేజి విద్యార్థులు యౌవనస్థుల మరణకారణ ములలో అది రెండవది. నరహత్య ఎప్పుడైనా పాపమే. ఆత్మహత్య స్వీయహత్యే (రోమా 13:9; నిర్గ 20:13).

విగ్రహారాధన వలన మానవ శరీరానికి కలిగే వినాశనము కూడ గొప్పది. విగ్రహా రాధన చేయువారు తమ శరీరములు కోసికొందురు, దవడలలో నుండి నాలుకలో నుంచి చాకులు గుచ్చుకొందురు, ముండ్ల మీదనడుదురు, రక్తమును కార్చుదురు. తమ శరీరములను అవమానపర్చు కొందురు.

ఈ రీతిగ మానవ శరీరముపై పాపము కలుగజేయు నాశనాన్ని గూర్చి ఎంతైనా మనం చెప్పుకోవచ్చును. అయితే మూడవదిగా, ఒకని మనస్సుపై పాపము కలుగజేయు నాశనాన్ని గమనించుదాం. "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయ ములో అనుకొందురు" అని బైబిలు చెప్పు చున్నది (కీర్తన 14:1). ఒకడు దేవుడు లేడని భావిస్తే, అతని హృదయాన్ని పాపం ఆక్రమిం చుకొన్నదని చెప్పుకోవచ్చును. యేసు కన్యకు జన్మించారని, మృతులలో నుండి తిరిగి లేచా రని, బైబిలు పరిశుద్ధాత్మావేశ లిఖిత గ్రంధ మని ప్రజలు కాదన్నప్పుడు వారి హృదయా లను పాపం జయించేసిందని మనకు తెలుసు. బైబిలులోనికి అద్భుతములు, యేసు యొక్క దైవత్వాన్ని ప్రజలు నిరాక రించినప్పుడు వారి మనస్సులు పాపము వలన బలహీనపర్చబడ్డాయని మనం ఎరుగు దుము. ఈలోకంలో ప్రతి పదిమందిలో ఒకడు మానసిక రోగియని చెప్పబడింది. ఇదంతయు పాపఫలితమే. "కీడు మేలనియు

కీడనియు చెప్పుకొని, చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు ఎంచుకొనువారికి శ్రమ" యని బైబిలు చెప్పుచున్నది (యెషయా 5:20). నేడు మనం చేస్తున్నది అదే. మన దేశం విషయంలో ఇదెంత విచారమో ! మర్త్యులైన మానవుల తలంపులను పాపము తారుమారు చేసేసింది.

నాల్గవదిగా పాపము మానవుల ఆత్మలకు వినాశము కలుగజేస్తాది. "విశ్వాస ఘాతకుల మార్గము కష్టము" అని బైబిలు చెప్పుచున్నది (సామె 13:15). "దౌష్ట్యమును విత్తువాడు కీడును కోయును" (సామె 22:8). గాలిని విత్తువారికి ప్రళయవాయువు కోతయగును (హోషేయ 8:6). పాపము చేయువాడే మరణము నొందును (యెహెజ్కేలు 18:20). పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). పాపము పరిపక్వమై మరణమును కనును (యాకోబు 1:15). పాపములో మరణించు వారు యేసుతో పరలోకములో యుండలేరు (యోహాను 8:21, 24). పాపములో జీవించు వారు నిత్యజీవమునకు పాత్రులు కారని తమకు తామే తీర్పు తీర్చుకొందురు (అపొ.కా. 13:46).

అందుకే "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" యేసు చెప్పెను (లూకా 19:10). పాపములోబడి నశించిన వారిని గూర్చి ఆయన చెప్పెను. లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి బొందెను (1 కొరింధీ 15:3). తండ్రియైన దేవుడు మనందరి దోషములను ఆయన మీద మోపెను (యెషయా 53:6). అపవాది యొక్క నరకము నుండి మన ఆత్మలను రక్షించుటకుగాను ఆయన అట్లు చేసెను.

చివరిగా పాపము దేవుని కృంగదీయును. అది దేవుని గాయపరచును. దేవునికి వ్యతిరేకముగా జరుగున దంతా పాపమే. యోసేపు పోతీఫరు భార్య వేసిన వలనుండి పారిపోయాడు. "నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని" అతడామెతో అన్నాడు (ఆది 39:9). క్రీస్తు దమస్కు మార్గమున సౌలుతో, "సౌలా, సౌలా నీవేల నన్ను హింసించుచున్నావని" పలికెను (అపొ. కా. 9:4). సౌలు సంఘమును హింసించుచుండెను, గాని నిజానికి అతడు క్రీస్తును హింసించుచుండెను. అతడు మన ప్రభువుకు వ్యతిరేకముగా పాపము చేసెను. మన సహోదరుని బలహీన మనస్సాక్షిని నొప్పించుట వలన ఆ సహోదరునికి వ్యతిరేకముగా పాపము చేయువారగుదుమని 1 కొరింధీ 8:12 చెప్పుచున్నది.

పరిశుద్ధాత్మను దుఃఖ పరచడం గూర్చి పౌలు చెప్పాడు (ఎఫెసీ 4:30). మనం ఆత్మను ఆర్పవచ్చని అతడు చెప్పాడు (1 థెస్స 5:19). మనం ఆత్మను తిరస్కరించగలము (హెబ్రీ 10:29). ఈ లేఖనములను బట్టి మనం దేవునికి వ్యతిరేకముగా పాపము చేయుదుమని తెలిసికొని యున్నాము.

పాపము ధ్వంసము చేయును. భౌతికముగా, మానసికముగా, ఆత్మీయముగా అది ధ్వంసము చేయును. మనలను పాపము నుండి నిత్య నరకము నుండి రక్షించడానికి సమస్తమును చేసిన దేవుని హృదయమును అది గాయపరచును. పెట్రోలుతో నిండియున్న గదిలో అగ్గిపుల్లలతో ఆడుకొనుట ఎట్లో పాపముతో చెలగాటములాడుట అట్లేయగును. ఇప్పుడో మరొకప్పుడో నీవు గాయపరచబడుట తథ్యము !

✍ - జాన్స్టసి

# బైబిల్ స్టడీ ప్రాముఖ్యమైనది

## (Bible Study is Important)

బైబిలును బట్టి మనకు తీర్పు జరుగును :

ఈ లోకంలో జీవించిన ప్రతివాడు తీర్పునాడు యేసు ప్రభువు యెదుట నిలబడ వలసియుండును. యిది ఖచ్చితం. ఎవడు దాని నుండి తప్పించుకొనలేడు (అపొ.కా. 17:30, 31; రోమా 2:1-16; 14:11, 12). క్రీస్తు వాక్యమును బట్టియు (యోహా 12:48). సువార్తను బట్టియు (రోమా 2:16) తీర్పు జరుగును. అందువలన బైబిలు పఠనము ప్రాముఖ్య మైనది. అది లేకపోతే తెలియకయే ఒకడు శిక్షకు గురి అయ్యే పద్ధతి నవలంబించును. "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాని గాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమో 2:15).

రక్షణ దానిపై ఆధారపడి యున్నది :

సువార్తను ఎరుగకపోతే ఒకడు పాపములో నశించిన స్థితిలో యుండును. క్షమాపణ కొరకు నిత్యజీవితం కొరకు మనం దేవుని చిత్తము నెరుగవలెను.

"లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించు చున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు చున్నవి" యని క్రీస్తు చెప్పెను (యోహా 5:39). "నమ్ము ప్రతి వానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). రక్షణ క్రీస్తులో యున్నది (2 తిమో 2:10). అయితే ఆయనను గూర్చి తెలుసు కొనిన వాడే ఆయన యొద్దకు, ఆయన యిచ్చు రక్షణ లోనికి రాగలడు (యోహాను 6:44-45).

**విశ్వాసము దాని వలన కలుగును :**

విశ్వాసము యొక్క ప్రాముఖ్యతలో బైబిలు పఠనము యొక్క ప్రాముఖ్యత గమనించుము. "విశ్వాసము లేకుండా దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). "కాగా వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17). విశ్వాసము లేకుండా రక్షణ కలుగునని మనం ఎట్లను కొనగలము? అట్లే రక్షించు విశ్వాసమును గూర్చిన జ్ఞానము లేనిదే రక్షణ లేదు !

**అభివృద్ధి దాని వలన కలుగును :**

ఆత్మీయ విషయాల్లో అభివృద్ధి బైబిలు పఠనము వలన కలుగును. ఎఫెసీ 4:15ను బట్టి చూస్తే దేవుని కుమారుని గూర్చిన అనుభవ జ్ఞానము వలన ఆత్మీయా భివృద్ధి సంభవించునని గ్రాహ్యమవుచున్నది. దేవుని పిల్లలు అభివృద్ధి చెందునట్లు తన వాక్యమును బయలుపరుచుటకు దేవుడు ప్రవక్తలను ఉపదేశకులను అనుగ్రహించెను. ఈ 21వ శతాబ్దములో ఆత్మావేశ లేఖనముల వలన మనం లబ్ధిపొందు చున్నాము. అవి మొదటి శతాబ్దములోనే వ్రాయబడెను (2 తిమో 3:16, 17, 2 పేతురు 3:15, 16). దేవుని వాక్యమనే పాలను, బలమైన ఆహారమును ఆపేక్షించుట వలననే నిజమైన అభివృద్ధి కనబడును (హెబ్రీ 5:13-14). "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను ఆపేక్షించుడి" (1 పేతురు 2:2).

**ఆనందమే దాని ఫలితం**

ఆత్మ యొక్క ఫలములలో సంతోషము, సమాధానములున్నవి (గలతీ 5:22). యిది గొప్ప సమాధానము (ఫిలిప్పీ 4:7). మరి యేదియు సమకూర్చలేదు. దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గము వలన యిది ప్రసాదించబడును (ఎఫెసీ 6:17). నిజానికి ఏ మానవుడు శాశ్వత శాంతినను గ్రహించ లేడు. సర్వసృష్టికర్తయైన దేవుడు మాత్రమే

దానిని ప్రసాదించగలడు. "యెహోవా తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మీయా 10:23), "నీ వాక్యము నా పాదములకు దీపమును నీ త్రోవకు వెలుగునై యున్నది" (కీర్త 119: 105). "యెహోవా ధర్మశాస్త్రమునందానిందించుచు దివారాత్రులు దానిని ధ్యానించువాడు ధన్యుడు" (కీర్తన 1:1-2).

బైబిలు పఠనము యొక్క ప్రాముఖ్యత గమనించిన తర్వాత, అనుదినము బైబిలును చదువుటకును ధ్యానించుటకును ఉపకరించెదవా? "వేలకొలది వెండి, బంగారం నాణెములు కంటె నీవిచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలు" (కీర్తన 119:72).

- హెచ్. జో స్పేంగ్లర్.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు మాటి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్‌లోను చూడండి.

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

## సంక్షిప్త వార్తలు

2004 సెప్టెంబరు 8వ తేదీ బుధవారం నాడు ముంగండలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. తదుపరి దానిలో జరిగిన సువార్త కూటము, బోధకుల సహవాస కూడికలో వాక్యోపదేశము చేసిరి. ఆనాడు వాతావర ణము వర్షము వలన అనుకూలించక పోయినను అనేకులు ఆ కూటము నకు హాజరైరి. ముంగండ గ్రామములో సోదరులు చేరుగొండి జాన్ బాబ్ గారు పలు సంవత్సరములుగా సువార్త చాటుచున్నారు. మంచి సంఘము నేర్పాటు చేసియున్నారు. జాషువా గారితో బాటు వారి సతీమణి కబితా గారును, కుమారుడు రాబిన్ గూటం గారును హాజరైరి. సదస్సు అనంతరం జరిగిన స్త్రీల కూడికలో సోదరి కబితాగారు స్త్రీలకు ప్రత్యేకంగా బోధించిరి.

సెప్టెంబరు 21, 22, 23 తేదీలలో కాకినాడ సత్యవాణి - క్రీస్తు సంఘ ఆధ్వర్యములో అంబేద్కర్ భవనంలో గొప్ప బైబిలు లెక్చర్‌షిప్ నిర్వహించ బడెను. రోజుకు మూడు దఫాలుగా ఈ లెక్చర్‌షిప్ నిర్వహించబడెను. మొదటిరోజు మొదటి కూటము నుండి లెక్చర్‌షిప్ హాలు నిండిపోయెను. ప్రతిరోజు 1000-1500 వందల మంది హాజరై దేవుని వాక్యమును శ్రద్ధగా వినిరి. ఆత్మీయ మేలుపొందిరి.

బైబిలు లెక్చర్‌షిప్‌లో అమెరికా నుండి వచ్చిన సోదరులు జేక్ తిబోడో, డా॥ కెన్ ఇయర్‌వుడ్, పాల్‌జోన్స్ మరియు రిక్కీ గూటంగారు దేవుని వర్తమానములనందించిరి. సోదరులు టి.వి.యన్.కుమార్, ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ (శ్రీకాకుళం) మరియు జాషువా గూటం గార్లు ప్రసంగములను ఆంగ్లము నుండి తెలుగు కనువదించుటలో సహాయపడిరి.

లెక్చర్‌షిప్ రెండవ రోజున శ్రీ గొల్లపల్లి సూర్యారావ్ గారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మంత్రి వర్యులు ముఖ్య అతిధులుగా వచ్చి సభకు చక్కటి హెచ్చరికల నిచ్చిరి. మంత్రి గారిని జాషువా గారు, వారి కూమారులు రిక్కీ, రాబిన్ గార్లు పూలమాలలతోను, శాలువతోను సత్కరించిరి.

లెక్చర్‌షిప్ అంతయును క్రమముగాను, మర్యాదగాను, దేవునికి ఘనత వచ్చునది గాను నిర్వహించబడెను. ఫ్లెమింగ్స్ గారి బృందము, రాజ్‌కుమార్ గారి బృందము చక్కటి పాటలు పాడుచు సభను ఆత్మీయముగా నడిపించిరి.

రామారావ్‌పేట క్రీస్తు సంఘము, సత్యవాణి బృందము వచ్చిన వారికి భోజనము వసతి, రవాణా సౌకర్యములు కల్పించి ప్రజల మన్ననల నొందిరి. లెక్చర్‌షిప్ కాలములో 22 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

పైనుదహరించిన విదేశీ సోదరులు పలుగ్రామములు దర్శించి సువార్త చాటిరి. అందున్న స్థానిక సంఘములను క్రైస్తవులను విశ్వాసములో బలపర్చిరి. వారు గండ్రేడు, జగ్గంపేట (గోపాలనగర్), బలభద్రపురం, దేవగుప్తం (పెద ఆంధ్రపేట), యెంట్రుకోన, పాలమూరు, పెదగరువు, తామరాడ, పి.కె.చెరువు, పులిమేరు, చదలాడ మొదలగు గ్రామములను దర్శించిరి. ఈ గ్రామములన్నిటిలోను మొత్తం 77 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అమెరికా నుండి వచ్చిన సోదర సోదరీలు 28వ తేదీ మంగళవారం స్వదేశము నకు తిరిగి ప్రయాణమైరి.

లెక్చర్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లా నుండి హాజరైన ప్రతివారికి మా హృదయపూర్వక వందనములను ఈ ప్రతికా ముఖముగా తెలియపర్చు కొనుచున్నాము.

* * * *

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.